క్లుప్తంగా

నగర వాసులకు సంక్రాంతి శుభాకాంక్షలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులందరూ భోగభాగ్యాలతో అందరూ సౌభాగ్యంగా ఉండాలని నగరపాలకసంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో నగర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతీ సంప్రదాయాలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన సంక్రాంతి పండుగని, సంక్రాంతి పర్వదినాన, హరిదాసుల భక్తి తత్వమైన స్వరాగాలతో, బసవన్నల ఆటలతో, గొబ్బెమ్మలతో రంగురంగుల రంగవల్లికలు ప్రకృతి శోభాయామానంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీలోని అంకమ్మతల్లి శక్తి పీఠం వార్షికోత్సవాలు ఆదివారం రెండోరోజుకు చేరుకున్నాయి. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తులు శరాబందీరావు పర్యవేక్షణలో అమ్మవారికి విశేషంగా పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం గ్రామోత్సవంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి ఊరేగింపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన అమ్మవారిని భక్తితో పూజిస్తే సకల కష్టాలు తీరుతాయన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ఆకాంక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ అన్నారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్‌స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం ఆరోగ్య అగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ట్రస్ట్ సేవలను వివరించారు. వయోవృద్ధులు ఆరోగ్యకర జీవనం సాగించటానికి గానూ తాము ప్రముఖ ఆయుర్వేద, అల్లోపతి, హోమియో వైద్య నిపుణులచే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్యనిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రెల్లి మేధావుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం లెనిన్ సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రెల్లి మేధావుల సంఘం అధ్యక్షుడు బండి ఆది సురేంద్ర మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వాలు పని చేయాలన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రెల్లి సంఘీయులకు రాజకీయంగా అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ పడ్డాది అప్పలరాజు, డాక్టర్ దలాయి ఆడమ్స్, సబ్ రిజిస్ట్రార్ బంగారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడ రూరల్): విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద టిఫిన్ బండి వద్ద పని కోసం వెళ్లిన యోడి వాసు నాయక్ కనిపించడంలేదని వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వాంబేకాలనీకి చెందిన యోడి వాసు నాయక్ ఈ నెల 11వ తేదీన పనికి వెళ్లిన ఆయన ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద విచారించిగా ఆచూకీ లేకపోవడంతో ఆయన భార్య అమావాస్య చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి

గన్నవరం రూరల్: క్రీడలతో శారీరక ధారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తోట కరుణ చెప్పారు. మండలంలోని సూరంపల్లి వేణుగోపాలస్వామి క్రీడా మైదానంలో స్థానిక యంగ్ బాయ్స్ కమిటీ ఆధ్వర్యంలో వరుసగా ఏడో ఏడాది నిర్వహించిన సంక్రాంతి క్రికెట్ పోటీలు ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విజేతలకు కరుణ బహుమతులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 46 క్రికెట్ టీమ్‌లు పాల్గొనటం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో విన్నర్‌గా హరీష్ సీసీ సావరగూడెం, రన్నర్‌గా బీజేఆర్ సీసీ అడవినెక్కలం నిలిచాయి. వారికి కరుణ ట్రోఫీలు అందజేశారు.

ప్రతి ఇంటా కొత్త వెలుగులు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



బీసెంట్ రోడ్డులో భోగి వేడుకల్లో పాల్గొన్న మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తెలుగు వారి అతి పెద్ద పండుగ సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. మూడురోజులపాటు జరిగే సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం భోగిని పురస్కరించుకుని 23వ డివిజన్ బీసెంట్ రోడ్డులో భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ ఏటా బీసెంట్ రోడ్డులో భోగి వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సంక్రాంతి సందర్భంగా నగరానికి పల్లె కళ వచ్చిందన్నారు. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు 'సంక్రాంతి' ప్రతీక అని పేర్కొన్నారు. కష్టించి పండించిన పంట సిరి చేతికొచ్చిన ఆనందంలో కళ్లల్లో విరిసే కోటి కాంతులతో రైతన్నలు ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. కనుమ నాడు వ్యవసాయ నేస్తాలైన పశువులను పూజిస్తారన్నారు. అటువంటి అన్నదాతల విషయంలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కన్న కలలను.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా పథకం, రాయితీ విత్తనాలు, పురుగుమందులు, యంత్ర పరికరాలు వంటి సంక్షేమ పథకాలతో జగనన్న ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తుందని చెప్పారు. కార్పొరేటర్లు శర్వాణి మూర్తి, కొంగితల లక్ష్మీపతి, ఒగ్గు విక్కీ, నాయకులు చల్లా సుధాకర్, అఫ్రోజ్, అక్బర్, తోపుల వరలక్ష్మి, పేరం త్రివేణి రెడ్డి, యక్కల మారుతి, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా భోగి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో ఆదివారం భోగి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధురానగర్, మాచవరం, ముత్యాలంపాడు, అయోధ్యనగర్, దుర్గాపురం, రామకృష్ణాపురం, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో తెల్లవారు జాము నుంచే భోగి మంటలు వేసి పూజలు చేశారు. భోగి మంటలో ఇంట్లో పనికిరాని చెక్కలు, ఇతర వ్యర్థాలు వేశారు. ఒకరినొకరు భోగి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సంక్రాంతి పండుగ నగర ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు తీసుకురావాలని, ప్రతి కుటుంబంలో సంతోషాలను నింపాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి కోరారు. సీపీఐ 58వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ కృష్ణా హోటల్ సెంటర్‌లో ఆదివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ నాయకులు కేవీ భాస్కరరావు సభాధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా మేయర్ భాగ్యలక్ష్మి విచ్చేసి మాట్లాడారు. సంక్రాంతి పండుగ అందరూ అన్నదమ్ముల్లాగా కులమతాలకతీతంగా జరుపుకుంటారని తెలిపారు. చిన్నాపెద్దా అంతా కుటుంబాలు, బంధువులు, స్నేహితులందరితో కలిసి ఆటపాటలతో ఆనందంగా గడుపుతారన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ ప్రాంతంలో ఇంత ఘనంగా సంక్రాంతి వేడుకలను నిర్వహించడం, అందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ముగ్గుల పోటీలు, పలు ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు, నిరుపేద మహిళలు, దివ్యాంగులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాపులర్ గ్రూపు సంస్థల చుక్కపల్లి అరుణ్ కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి.కోటేశ్వరావు, సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, ప్రశాంతి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సింగ్‌నగర్‌లో సందడిగా సంక్రాంతి ఆటల పోటీలు

అజిత్ సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 59వ డివిజన్ సింగ్‌నగర్ లూనా సెంటర్ లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వైఎల్‌వి ప్రసాద్ స్మారక సంక్రాంతి క్రీడా పోటీలు ఆదివారం కోలాహలంగా జరిగాయి. మహిళలు, యువతులు, చిన్నారులు అనేక పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబర్చారు. 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, వ్యాపారవేత్త ఉదయ్‌భాస్కర్, నిర్వాహకులు పాల్గొన్నారు.



మధురానగర్‌లో భోగి మంటలు వేస్తున్న స్థానికులు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, చుక్కపల్లి అరుణ్‌కుమార్, సీపీఐ నాయకులు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ షాహీనాసుల్తానా

అంగరంగ వైభవంగా వేడుకలు

ఇంద్రకీలాద్రిపై సంక్రాంతి కోలాహలం



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించునేందుకు వచ్చిన భక్తులు



బొమ్మల కొలువు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సంక్రాంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన భోగి మంటలను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో కేఎస్ రామారావులతో పాటు ఆలయ అధికారులు, అర్చకులు, పాలక మండలి సభ్యులు వెలిగించారు. తొలుత భోగి మంట వద్ద ఆలయ చైర్మన్, ఈవోలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసిన గంగిరెద్దులకు పూజలు నిర్వహించి దాణా అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అమ్మవారి ఆలయంలో సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. పల్లె వాతావరణాన్ని తలపించేలా పూరిపాకలు, గంగిరెద్దులు, హరిదాసులు, మట్టి పాత్రల తయారీ, పందెం కోళ్ల గూళ్లు, మేళతాళాలతో తెలుగు వారి సాంప్రదాయం ఉట్టి పడింది. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పల్లె వాతావరణాన్ని చూసి ముగ్ధులయ్యారు. చిన్నారులు, పెద్దలు సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, ఆలయ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. అమ్మవారి ఆలయంతో పాటు చిన్న గాలిగోపురం, ప్రధాన ఆలయం ద్వారం వద్ద పూలతో చేసిన అలంకరణ అందరిని ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని అరటి చెట్లు, మామిడి తోరణాలతో అలంకరించారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

రాజగోపురం ఎదుట కళావేదిక వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది. వివిధ దేవతా మూర్తుల విగ్రహాలు, కొండపల్లి బొమ్మలతో పాటు పల్లె వాతావరణాన్ని తలపించే బొమ్మలు అందరిని ఆకట్టుకున్నాయి. బొమ్మల కొలువును చైర్మన్, ఈవోలు ఆవిష్కరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం బొమ్మల కొలువు వద్ద చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు.

భక్తులతో క్యూలైన్లు రద్దీ

అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. హైదరాబాద్, తెలంగాణాలోని పలు ప్రాంతాలతో పాటు బెంగళూరు, ముంబాయి, పూనే నుంచి పండుగను స్వస్థలాలకు బయలుదేరిన వారు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తుల రద్దీతో క్యూలైన్లు కిటకిటలాడాయి.

చలన చిత్ర పరిశ్రమపై శోభన్‌బాబుది చెరగని ముద్ర



శోభన్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నటభూషణ్ శోభన్‌బాబు 88వ జయంతి శోభన్ సిండికేట్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏలూరు లాకుల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సిండికేట్ అధ్యక్షుడు క్లోపల్లి మధుసూదనరాజు, ప్రధాన కార్యదర్శి దారా సత్యం శోభన్‌బాబు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర శోభన్ సిండికేట్ అధ్యక్షుడు డాక్టర్ కళ్ళేపల్లి మధుసూదనరాజు మాట్లాడుతూ శోభన్‌బాబు మరణించి 16 సంవత్సరాల గడిచినా నేటికీ ఆయన మన మధ్యనే ఉన్నాడన్న భావన కలుగుతోందని పేర్కొన్నారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమపై చెరగని ముద్రవేశారని కొనియాడారు. నటనలో తనకంటూ ప్రత్యేక శైలిని ప్రదర్శించి అశేష అభిమానులను తన సొంతం చేసుకున్నారని చెప్పారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ ధారా సత్యం మాట్లాడుతూ శోభన్‌బాబు నేటి తరం నటులందరికీ ఆదర్శప్రాయుడన్నారు. ఆయన జీవిత విశేషాలు గురించి వివరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన సలహాదారు రేమాల రామకృష్ణ, కన్వీనర్ బి. ఆంజనేయులు, వైస్ ప్రెసిడెంట్ కె.జగన్మోహన్, సహాయ కార్యదర్శి వెంకట్, సలహాదారులు కేవీ సుబ్బరాజు, రామకృష్ణ, పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరం నడిబొడ్డున ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రతి ఒక్కరూ తరలి రావాలని పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశాల మేరకు 32వ డివిజన్ బసవతారకనగర్‌లో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ అధ్యక్షుడు పాలిమెట్ల శరత్ బాబు డివిజన్ ఎస్సీ నాయకులు యాకోబు, రాబర్ట్, లక్ష్మణ, బత్తుల సుబ్బారావు, మేకతోటి రవి, బాలా, డేవిడ్, పేరం త్రివేణి, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోదా రంగనాథల కల్యాణం



రాజీవ్‌నగర్లో కల్యాణోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడులోని షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన గోదారంగనాథ స్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణలతో గోదా రంగనాథ స్వామివారి కల్యాణం జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవంలో పాల్గొనిపూజలు చేశారు. ఏపీఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ గోదా రంగనాథ స్వామి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను పారాయణమండలి కన్వీనర్ మండలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు. మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో ఆదివారం శ్రీగోదా రంగనాథస్వామివారి కల్యాణం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు. ముత్యాలంపాడులోని శ్రీకోదండ రామాలయంలో కల్యాణోత్సవం చేశారు. పలు రకాల పుష్పాలతో స్వామివారికి విశేషంగా అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. మధురానగర్ భగవాన్ షిర్డీసాయి బాబా మందిరంలో కల్యాణం జరిగింది. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి, పీపీఎల్ఎన్‌రాజు దంపతులు పాల్గొని పూజలు చేశారు.

దేవీనగర్ కోదండ రామాలయంలో ఆదివారం సాయంత్రం ఆలయ కమిటీ ఆధ్వర్యాన కల్యాణం జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ కార్యదర్శి గంగిశెట్టి సాంబశివరావు పర్యవేక్షించారు.



ముత్యాలంపాడులో గోదారంగనాథస్వామి కల్యాణంలో డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి



దాసాంజనేయస్వామివారి దేవాలయంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు పూజలు



ముత్యాలంపాడులో భక్తులు

వైభవంగా గోదాదేవి కల్యాణం

పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్‌నగర్లోని శ్రీకోదండ రామాలయంలో ధనుర్మాసం చివరి రోజు ఆదివారం శ్రీరంగనాథ గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. తొలుత శ్రీరంగనాథునికి గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగి పండుగ కావడంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రెసిడెంటు కండేపు గురవయ్య, కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు శివరామకృష్ణశర్మ పాల్గొన్నారు.

కోరికల నుంచి బయట పడటమే పండగ పరమార్థం

మైలవరం: భోగ భాగ్యాల కోరికల నుంచి బయట పడటమే నిజమైన భోగి పండగ అర్థం అని నర్రా శ్రీనివాసరెడ్డి తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఆదివారం ఉత్తరాయణం భోగి, సంక్రాంతి విశిష్టతను తెలియజేసేందుకు ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండల కేంద్రంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. త్రిమత ఏకైక గురువు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కంభం కమిటీ, దొనకొండ కమిటీల అధ్యక్షులు, సభ్యులు నర్రా శ్రీనివాసరెడ్డి, ఏడుకొండలు, కోటేశ్వరి, లక్ష్మి, నారాయణమ్మ, తిరుపతమ్మ, వెంకీ, శ్రీనివాసరెడ్డి, శ్రీను, కృష్ణారెడ్డి, కృష్ణ కోమలి, అరుణ పాల్గొన్నారు.

నేడు వీఎంసీ 'స్పందన' రద్దు

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా వీఎంసీ ప్రధాన కార్యాలయంలో, సర్కిల్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం సెలవు కావడంతో రద్దు చేస్తున్నామని తెలిపారు. నగర వాసులు గమనించాలని కోరారు.

ముస్లింల సమస్యలు పరిష్కారానికి కృషి

పాయకాపురం(విజయవాడరూరల్): ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి ఆజాద్ ముస్లిం కమిటీ కృషి చేస్తుందని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక నాగుల్ మీరా అన్నారు. ఆదివారం 61వ డివిజన్ శాంతినగర్లో ముస్లిం మైనార్టీల సమావేశం నిర్వహించారు. ముస్లిం మహిళలు తమ ఆర్థిక పరిస్థితులను మెరుగు పర్చేందుకు కుట్టుమిషన్లు, బడ్డీ కొట్లు, మొబైల్ బండ్లు కమిటీ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. ఆడపడుచుల పెళ్లిళ్లకు కూడా సహాయం అందచేయనున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ నగర ప్రధాన కార్యదర్శిగా షేక్ గుల్ నాజ్ బేగంను నియమించి నియామక పత్రం అందచేశారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ మౌలాలి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్, 61వ డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

అ 'పూర్వ' సమ్మేళనం

పెనుగంచిప్రోలు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 2002–2003 పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులంతా ఆదివారం తమ పాఠశాలను సందర్శించారు. పాఠశాల రోజులను మళ్లీ గు ర్తుకు తెచ్చుకోవడంతోపాటు గత స్మృతులను నెమరవేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులును మననం చేసుకున్నారు.. ప్రస్తుతం ఎవరు ఏమి చేస్తున్నారో ఒకరికొకరు ఆసక్తిగా తెలుసుకున్నారు. అనంతరం పెనుగంచిప్రోలులోని తంబరేణి గార్డెన్స్‌లో వారంతా కలిసి సామూహిక భోజనాలు చేశారు.తమతో కలసి చదువుకున్న ముండ్లపాటి రాజేష్ అనేవ్యక్తి అనారోగ్యంతో ఉన్న విషయాన్ని తెలుసుకుని అతనికి రూ.15 వేలు ఆర్థిక సాయంగా అందజేసి స్నేహధర్మాన్ని పాటించారు. అనంతరం నాడు పాఠాలు బోధించిన గురువులను సన్మానించి, వారి ఆశీస్సులు పొందారు. పూర్వవిద్యార్థులంతా ఇలా కలవడంపై ఆనందం వ్యక్తంచేశారు.



అపూర్వ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): తోటివారికి సాయం చేయటం అలవాటుగా చేసుకోవాలని వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ చిన్నం రామకృష్ణ కోరారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా దుర్గాపురంలో ఆదివారం బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. బీఆర్‌టీఎస్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ నగరాన్ని శుభ్రంగా ఉంచటానికి అహర్నిశలు శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు తమ వంతు బాధ్యతగా చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. రాబోయే రోజులలో క్లబ్‌సభ్యుల సహకారంతదో సేవలు మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బి.గాంధీ, మురళీ కృష్ణ బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి కొండా యగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడు కొండలు,పసుపులేటి రమేష్, నాగ మల్లిక, షఫీ, బీసీ నాయకులు గోకర్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తంబి తిరునాళ్ల

ఉంగుటూరు: దక్షిణ భారతదేశంలో సుప్రసిద్ధి చెందిన కథోలిక పుణ్యక్షేత్రమైన పెద అవుటపల్లిలో తంబి క్షేత్రంలో బ్రదర్ జోసఫ్ తంబి 79 వర్ధంతి మహోత్సవాలు అత్యంత వైభవంగా ఆధ్యాత్మికంగా కొనసాగుతున్నాయి. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, ఒడిశా, కేరళ రాష్ట్రాల్లో కథోలిక గురువులు, విశ్వాసులు మహోత్సవాలకు తరలివచ్చారు. మహోత్సవాల రెండో రోజు ఆదివారం కావడంతో పరిసర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. భక్తులు కొవ్వొత్తులు వెలిగించి చేతపట్టుకుని తంబి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. తంబి సమాధి వద్ద తమ కోరికలు తీర్చాలని వేడుకున్నారు. కోరికలు తీరినవారు మొక్కుబడులను చెల్లించుకున్నారు. పోలీసులు, వలంటీర్లు, ప్రైవేటు సెక్యూరిటీ భక్తుల భద్రత చర్యలు చేపట్టారు. ఎంపీడీవో శేషగిరిరావు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. పీహెచ్‌సీ వైద్యులు షిఫ్ట్‌ల వారీగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి సేవలందించారు.